www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025
5
కోనసీమ




## సామాజికవేత్త పచ్చిమాల బాబ్జి మృతి

**ప్రజాశక్తి-అమలాపురం రూరల్**

వన్నె చింతలపూడికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, ఉద్యమకారుడు, అంబేడ్కర్ ఫెలోషిప్, ఆంధ్రశ్రీ, నంది అవార్డుల గ్రహీత పచ్చిమాల బాబ్జీ సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన కుమారుడు సిపిఎం నాయకుడు వసంత కుమార్ ఈ ఏడాదిలోనే మరణించారు. వారిద్దరూ కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాటం చేసిన వారే.


బాబ్జీ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నేతలు

# చికెన్ వ్యాపారం కుదేలు..

## 10 శాతానికి పడిన చికెన్ విక్రయాలు

**ప్రజాశక్తి-రాజోలు**

బర్డ్‌ఫ్లూ ప్రభావం.. చికెన్ పేరెత్తితేనే జనం బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు వెలుగు చూడనప్పటికీ ప్రజలు మాత్రం చికెన్ తినాలంటే చాలు వణికిపోతున్నారు. ముక్క లేకుండా ముద్ద దిగని వారు సైతం వెనుకంజ వేస్తున్నారు. చివరికి కోడిగుడ్డు తినాలంటే కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి. ఫలితంగా చికెన్ ధరలు పతనమయ్యాయి. పట్టణాలు, గ్రామాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు మాత్రం అల్లాడిపోతున్నారు.



**పడిపోయిన గుడ్ల అమ్మకాలు.. !**

బర్డ్ ఫ్లూ ప్రభావం కోడిగుడ్డు మీద కూడా పడింది. జిల్లాలో కోడిగుడ్లను విక్రయించే హోల్‌సేల్ దుకాణాలు 80కి పైగా ఉన్నాయి. ఇక రిటైల్ వ్యాపారుల లెక్క లేదు. కోడిగుడ్ల దుకాణాలతో పాటుగా చిల్లర దుకాణాలు, కూరగాయల దుకాణాల్లో కూడా కోడిగుడ్లను విక్రయిస్తుంటారు. జిల్లాలో రోజుకు లక్ష కోడి గుడ్ల వరకు అమ్ముతుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటిది ఇప్పుడు 35 వేల నుంచి 40 వేల వరకు కూడా విక్రయాలు జరగడం లేదని వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 12 నుంచి 15 లక్షల కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. రాజోలు నియోజకవర్గంలో 100 చికెన్ దుకాణాలు ఉండగా ఆదివారం మరో 50 దుకాణాల వరకు రోడ్డు పక్కన, వీధుల్లో పెట్టుకొని చికెన్ విక్రయిస్తుంటారు. జిల్లాలో 800 నుంచి 1000 చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో కనీసం సరాసరిన 200 కేజీల చికెన్ విక్రయాలు జరుగుతాయి. పేరున్న దుకాణాల్లో రోజుకు 200 కిలోల నుంచి 400 కిలోల చికెన్ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం వస్తే దాదాపు అన్ని దుకాణాలు కిటికిటలాడుతుంటాయి. పెద్ద దుకాణాల్లో 500 కిలోల చికెన్ విక్రయాలు జరుగుతుంటాయని సమాచారం. కిలో చికెన్ ధర ప్రస్తుతం రూ.180 నుంచి రూ.230 వరకు ఉంది.

**70 శాతానికి పైగా తగ్గిన చికెన్ అమ్మకాలు**

ఎప్పుడైతే గోదావరి జిల్లాలో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నట్లుగా వార్తలు రావడం మొదలైందో అప్పటి నుంచే చికెన్ అమ్మకాలు క్రమంగా పడిపోతూ వచ్చాయి. సోషల్ మీడియాలో చికెన్ తినవద్దంటూ జరిగిన ప్రచారం మరింత ప్రభావం చూపింది. అత్యధిక శాతం ప్రజలు చికెన్ తినడం మానేశారు. దీంతో 60 నుంచి 70 శాతం వరకు చికెన్ విక్రయాలు తగ్గిపోయాయని తెలుస్తోంది. బిర్యానీ హోటళ్లపై కూడా ప్రభావం పడింది. దీంతో రోజుకు 100 కిలోల చికెన్ తీసుకొని పోయే హోటళ్ళు కూడా ఇప్పుడు 25 నుంచి 35 కిలోల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నగరంలో, జిల్లాలో కానీ చికెన్ దుకాణాలు ఖాళీగా బోసిపోతున్నాయి. దీంతో చికెన్ దుకాణాల వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

**డిసెంబరు నుంచే కోళ్ల వైరస్**

నిజానికి జిల్లాలో గతేడాది డిసెంబరు నుంచే వైరస్ ప్రభావం కనిపించినట్లు పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ప్రధానంగా తీర ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. తీర ప్రాంతంలో నాటు కోళ్ల పెంపకం ఎక్కువగా ఉంటుంది. అదికూడా పందెం కోళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో కోడిని రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తారు. వీరిలో చాలా మంది ఈ పరిస్థితిని ముందుగా ఊహించి అప్రమత్తమై కొంచెం ముందుగానే కోళ్లను విక్రయించినట్లు సమాచారం. మిగిలిన రైతులు మాత్రం ఆర్థికంగా బాగా నష్టపోయారు. ఒక్కొక్కరూ రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోయినట్లు తెలుస్తోంది. అంతేకాదు డిసెంబర్, జనవరి నెలల్లో నాటు కోళ్లు సైతం ఎక్కువగా చనిపోయినట్లు సమాచారం. నాటు కోళ్లను పెంచిన వారు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పౌల్ట్రీ పరిశ్రమ ఇప్పట్లో కోలుకోవడం కష్టమని అంటున్నారు. చికెన్ తినాలంటే వణికిపోతున్న ప్రజలు జిల్లాలో 70 శాతం వరకు తగ్గిన విక్రయాలు తీరం వెంబడి డిసెంబర్, జనవరిలోనే చనిపోయిన కోళ్లు గుడ్ల విక్రయాలపైనా ప్రభావంతో పౌల్ట్రీ వ్యాపారులు అల్లాడిపోతున్నారు.

**జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావం లేదు..**

మన జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు. గోదావరి జిల్లాలో కూడా ఒక పరిమిత ప్రాంతంలో మాత్రమే బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించాయి. అయినప్పటికీ సోషల్ మీడియాలో విపరీతమైన దుష్ప్రచారం జరుగుతోంది. ప్రజల్లో భయాందోళనలు కలిగేలా ప్రచారం చేస్తున్నారు. దీంతో నాలుగు రోజులుగా చికెన్ అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అపోహలు తొలగించేందుకు ప్రచారం నిర్వహించాలి.

**- మోహన్, చికెన్ దుకాణం నిర్వాహకుడు.**

## వీర రాఘవులును గెలిపించాలి

**ప్రజాశక్తి-అమలాపురం, కాట్రేనికోన**

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులను అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపు ఇచ్చారు. అమలాపురం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో పట్టభద్రుల వాణి వినిపించేలా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు గతంలో కూడా పోరాటం చేశారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సాధనాల వెంకటరావు, బొంతు రమణ, వడ్డి నాగేశ్వరరావు, తులసీరావు పాల్గొన్నారు.


అమలాపురంలో మాట్లాడుతున్న నాయకులు

**కాట్రేనికోన** ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డి.వి.రాఘవులుకు తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ముమ్మురంగా ప్రచారం నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కాట్రేనికోన మండల పరిధిలోని పల్లంకుర్రు, కందికుప్ప పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో తమ మొదటి ప్రాధాన్యతా ఓటును కార్మికుల పక్షాన పోరాడే డి.వి.రాఘవులకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు విప్పర్తి మోహన్ రావు, బడుగు శ్రీనివాసరావు, నీతిపూడి ప్రసాదరావు పాల్గొన్నారు.


కాట్రేనికోనలో ప్రచారం చేస్తున్న నాయకులు

## బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందవద్దు

**ప్రజాశక్తి-కొత్తపేట**

జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేనందున ఎవరూ ఆందోళన చెందవద్దని కొత్తపేట ఆర్‌డిఒ పి..శ్రీకర్ తెలిపారు. కొత్తపేట ఆర్‌డిఒ ఆఫీసులో సోమవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, కోళ్ల పెంపకందారులతో బర్డ్‌ఫ్లూపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా పశుసంవర్ధక శాఖ తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు ఆయనకు వివరించారు. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ జిల్లాలో ఎక్కడా లేదని, ముందస్తు చర్యలలో భాగంగా రాపిడ్ రెస్పాన్స్ టీములు ఏర్పాటు చేసి కోళ్ల ఫారంలో ఏమైనా కోళ్ల మరణాలు సంభవిస్తున్నాయా లేదా అని ఆరా తీస్తున్నామని తెలిపారు. కోళ్ల పెంపకందారులు అందరూ కోళ్ల ఫారాల్లోకి ఇతరులను అనుమతించవద్దని, కోళ్ల ఫారాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం మన జిల్లాల్లో బర్డ్ ఫ్లూ లేనందున ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. వండిన మాంసం, గుడ్లు తినడం వల్ల వ్యాధి రాదని తెలిపారు. దీనిని ఆసరాగా తీసుకొని గొర్రె, మేక, చేప మాంసాలను అధిక ధరలకు అమ్మితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ సిహెచ్.వెంకట నారాయణ, డాక్టర్ ఎస్.ఉమా మహేశ్వర రెడ్డి, డాక్టర్ అనిత పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంపై సమీక్ష

**ప్రజాశక్తి-అమలాపురం**

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు 10 రోజుల పాటు దిగ్విజయంగా నిర్వహించి విజయవంతం చేసిన అధికారులందరికీ జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జిల్లాస్థాయి అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణ తీరు, అభిప్రాయాలను గమనించి, లోటుపాట్లు భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లా స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ పది రోజులపాటు కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా అధికారుల బృందం సమన్వయంతో ఉత్సవాలు నిర్వహించినట్టు తెలిపారు. బీచ్ వద్ద స్నాన ఘట్టాల సౌకర్యాలను మెరుగు పరచాలన్నారు ఆలయం చుట్టుపక్కల రోడ్లను సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దాలని గండ్లు పూడ్చి సముద్రపు నీరు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించ కుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఫెర్రీ పాయింట్ అభివృద్ధి చేయాలని కోరారు. ఉత్సవ కమిటీ చైర్మన్ డి.బాలాజీ మాట్లాడుతూ సిఎస్‌ఆర్ నిధుల ద్వారా తాగునీటి వసతులు కల్పించాలని కోరారు. డిఆర్‌ఒ బిఎల్ఎన్.రాజకుమారి, ఆర్‌డిఒలు కె.మాధవి, పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, సిహెచ్ఎన్‌వి.కృష్ణారెడ్డి, డిఎస్‌పిలు మురళీకృష్ణ ప్రసాద్, పీడీలు శివశంకర్ ప్రసాద్, ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.

## వికలాంగుల గుర్తింపు సర్వే

**ప్రజాశక్తి-ముమ్మిడివరం**


అంగ వైకల్యంగల చిన్నారులను గుర్తించి, సదరం క్యాంపు ద్వారా వికలాంగ గుర్తింపు సర్టిఫికెట్స్ మంజూరుకు సర్వే నిర్వహిస్తున్నట్లు కమిటీ బందం పేర్కొంది. మండల పరిధిలోని కొమానపల్లి పంచాయతీ పరిధిలో సోమవారం 12 మంది సభ్యుల బందం ఇంటింటికీ వెళ్లి 1-18 మధ్య వయసు గల చిన్నారుల్లో ఎవరైనా వికలాంగుల ఉన్నారా అని సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో అర్హత ఉండి వైకల్య సర్టిఫికెట్ లేకపోతే వారిని గుర్తించి, సదరం క్యాంపునకు సిపార్సు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నాయా, వంటి వివరాలను సేకరించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తుంటే తెలపాలని కోరారు.

## దేవాంగ సంఘం అధ్యక్షునిగా వూటుకూరి

**ప్రజాశక్తి-అమలాపురం రూరల్**

బండారులంకకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి, మాజీ మండలాధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాంగ సంఘం అధ్యక్షునిగా, ప్రొద్దుటూరుకు చెందిన మాడిశెట్టి శివ శంకరయ్య ప్రధాన కార్యదర్శిగా, ఏలూరుకు చెందిన కొండపల్లి పరమేశ్వరరావు కోశాధికారిగా నియమితులయ్యారు. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం తృతీయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా వూటుకూరికి పలువురు అభినందనలు తెలిపారు. బొమ్మన దుర్గా ప్రసాద్, నక్కిన చిన వెంకటరాయుడు, బండారు ఆనంద ప్రసాద్, చింతా శంకరమూర్తి, మాడా మాధవి, మచ్చా నిరంజన్, బళ్ల వెంకటరమణ, చల్లా రామారావు, వట్టం గణేష్ పాల్గొన్నారు.

**కార్టూ'నిజం'**




## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి-కాట్రేనికోన**

నేడు కాట్రేనికోన మండలంలో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిధిలోని కాట్రేనికోన సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. కాట్రేనికోన, దొంతికుర్రు, గెద్దనాపల్లి, పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, కుండలేశ్వరం, బలుసుతిప్ప తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

## 28 వరకు ఆధార్ శిబిరాలు

**ప్రజాశక్తి -మామిడికుదురు**

మండల పరిధిలో ఈ నెల 18 నుండి 28 వరకు మొబైల్ ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 18న లూటుకుర్రు, 19న ఆదుర్రు, 20న మగటపల్లి, 21న గోగన్నమఠం, 22న గెద్దాడ, 24న మొగలికుదురు, 25న మామిడికుదురు, 28న కొమరాడలో ఏర్పాటు చేసిన ఈ ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా వీరభద్రుని సంబరం

**ప్రజాశక్తి - అంబాజీపేట**

గంగలకుర్రు అగ్రహారం అరిగెలవారిపాలెంలో వీరభద్ర స్వామి సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి వీరనాట్య బృందం, నంగవరం తాషాలు, గంగలకుర్రు సాయి బ్యాండ్ పార్టీ ఆధ్వర్యాన స్వామివారిని ఊరేగించారు. సాయంత్రం గోడి భేతాలుడి శూలాలు, రాజమండ్రి సింహాద్రి ఈవెంట్స్ శక్తి వేషాలతో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. వీరభద్ర స్వామి వారికి అరిగెల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.80 వేలతో వెండి కిరీటం, యర్రంశెట్టి సాయిరామ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు వీరభద్రరావు ఇత్తడి, మకర తోరణం బహుకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. పాద రవి కుమార్తె, అల్లుడు భువనగిరి విజయకుమార్, అశ్విని దంపతులు రూ.పది వేల 116 విరాళం అందజేశారు. పద్మ వెంకట లారీ కాటా(రాజు) టీ, టిఫిన్లు ఏర్పాటు చేశారు.

## రోజ్ మిల్క్ ఫ్రాంచేజీ ప్రారంభం

**ప్రజాశక్తి-మండపేట**

మండపేట పట్టణం మెయిన్ రోడ్డులో వివిఎస్ఎస్.చౌదరి షాపింగ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజమహేంద్రవరం రోజ్ మిల్క్ ఫ్రాంచైజీను సోమవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, కొనగళ్ల సత్యనారాయణ, జొన్నపల్లి సూర్యారావు, గడి రాంబాబు, బడుగు రత్నంరాజు, పాలచర్ల శిరీష్, బొడ్డు రామకృష్ణ, పిల్లా గణపతి, వంక మణి పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

**అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సోమవారం పలుచోట్ల వర్కర్లు ఆందోళనలు నిర్వహించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చెయ్యాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు.**

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**అమలాపురం రూరల్** ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి అధ్యక్షతన ప్రాజెక్టు ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ సెంటర్లను పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదని, వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామని, సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలైలో వేతనాలు పెంచుతాము, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తానని మినిట్స్ ఇచ్చారని, అయినా నేటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి రత్నకుమారి, రుక్మిణి, పరిపూర్ణ, పార్వతి, శమంతకమణి పాల్గొన్నారు.

**రామచంద్రపురం** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, యూనియన్ రామచంద్రపురం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు వరలక్ష్మి, మేడిసెట్టి దుర్గమ్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపించాలని తక్షణమే గ్రాడ్యుటీ అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని, రకరకాల యాప్‌ల పేరుతో వర్కర్లపై పని భారం విపరీతంగా పెంచారని, పని భారాన్ని తగ్గించి యాప్‌లన్నీ ఒకే యాప్‌గా తీసుకురావాలన్నారు. మెనూ ఛార్జీలను పెంచాలని, రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న అంగన్‌వాడీ పోరాటం చూసి రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, గత ప్రభుత్వం హయాంలో రాసుకున్న మినిట్స్‌లో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కారం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడానికి సిద్ధపడుతున్నామని అన్నారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వరాహలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నం, చంద్రకళ, జి.శ్రీదేవి, కె.దుర్గ, ఐ.గోనతి దేవి, సూర్య కళ పాల్గొన్నారు.

**ముమ్మిడివరం** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దుర్గా మల్లేశ్వరి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా అంగన్‌వాడీల సమస్యల పరిస్కారానికి చర్యలు తీసుకోపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు ఒక పక్క పని భారం మోపుతూ, మరో పక్క కనీస వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జి.అనంత లక్ష్మి, శ్రీదేవి, గాలి మంగాయమ్మ, హైమావతి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం** మండపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు కపిలేశ్వరపురం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.బేబీ, సిహెచ్.రాణి మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జిఒ ఇవ్వాలని కోరారు. హెల్పర్స్ ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సర్వీసులో చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు సమ్మె కాలంలో కూడా చనిపోయిన వారికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండపేట కార్యాలయంలో సిడిపిఒ గజలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్స్ పి.కుమారి, ఎం.జానకి దేవి, టి.మంగాదేవి, పి.అనంతలక్ష్మి, నాగలక్ష్మి, కుమారి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


రామచంద్రపురంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


అమలాపురంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



ముమ్మిడిరంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


కపిలేశ్వరపురంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

## రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ

**ప్రజాశక్తి-మామిడికుదురు**

216వ జాతీయ రహదారి పాశర్లపూడి బ్రిడ్జి నుంచి చింతల మెరక మీదుగా పాశర్లపూడి లంక వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపిటిసి చెరుకూరి పార్వతి సత్తిబాబు సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కోలా సత్తిబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కోలా సత్యనారాయణ, మామిడిసెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ఎంపిటిసిలు

## వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థుల సందర్శన

**ప్రజాశక్తి - అంబాజీపేట**

పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాల బిఎస్‌సి మొదటి సంవత్సరం 20 మంది రెండో సెమిస్టర్ విద్యార్థులు సోమవారం అంబాజీపేట ఉద్యాన పరిశోధన స్థానాన్ని సందర్శించారు. కీటక శాస్త్ర విభాగం జీవ నియంత్రణ ప్రయోగశాలలో పరిశోధనల బదనికలను అభివృద్ధి చేయడం, కొబ్బరి, కోకోలలో పరిశోధనలు, తెగుళ్ల విభాగంలో జీవ నియంత్రణ శిలీంద్రాన్ని ఉత్పత్తి చేయడం, తెగుళ్ల యాజమాన్యంలో పరిశోధనలపై పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ ఎన్‌బివి.చలపతిరావు విద్యార్థులకు వివరించారు. క్షేత్రస్థాయిలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, ఎఐసిఆర్‌పి ఆన్‌ప్లామ్, ఎఐసిఆర్‌పి ఆన్ బయోలాజికల్ కంట్రోల్ వంటి పథకాలతో నిర్వహిస్తున్న పరిశోధనలను వివరించారు. శాస్త్రవేత్తలు ఉద్యాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.మమత, తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, విద్యార్థులకు జీవనియంత్రణ పద్ధతుల గురించి ఆమూలాగ్రం తెలిపారు. బోటనీ అధ్యాపకురాలు జి.పూజ పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

ప్రజాశక్తి - కడియం, ఆలమూరు

రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో భర్త మృతి చెందాడు. భార్య తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన ఆదివారం రాత్రి మడికి వద్ద చోటు చేసుకుంది.. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన గంటి రాజు, తన భార్య కుమారితో కలసి ఆదివారం రాత్రి కొత్తపేట మండలం మందపల్లిలో ఓ వివాహ వేడుకకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దుళ్లకు చేరువలో మడికి కాలువ గట్టుపై ముగ్గురు యువకులు బైకుపై ఎదురుగా వచ్చి వీరిని ఢీకొన్నారు. దీంతో రాజు, కుమారిలతో పాటు, ఆ ముగ్గురు యువకుల్లో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.. వీరిని స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో రాజు(33) మృతి చెందాడు. కుమారి రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి కోమాలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజు కేశవరంలోని ఓ ప్రైవేట్ కూల్ డ్రింక్ కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. రాజు, కుమారి దంపతులకు రెండేళ్ల చిన్నారని ఉంది. రాజు మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

### 1.7 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కోరుకొండ

జంబూపట్నం శివారు అయ్యన్నగళ్ల వద్ద గంజాయిని తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 1.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని నార్త్ జోన్ డిఎస్పి వై.శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. అయ్యన్నగళ్ల సమీపంలోని రోమ్ సిటీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని సోదా చేయడంతో 1.7 కేజీల గంజాయి దొరికిందన్నారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరంతా రాజానగరం, కోరుకొండ మండాలాలకు చెందిన వారన్నారు. వీరి నుంచి ఒక బైకును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వై సత్యకిషోర్, ఎస్ఐ టి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

ఒకే కుటుంబానికి చెందిన తోటి కోడళ్లు రోడ్డు ప్రమాదంలో మతి చెందారు. మండలంలో పాలచర్ల గ్రామంలో నర్సరీలో పని ముగించుకుని కానవరం ఇంటికి మోటారు సైకిల్ పై కప్పల నాగేశ్వరావు, అతని భార్య రివచ్చా((40), వదిన చంద్రమ్మ(45) వెలుతున్నారు. దివాన్ చెరువు జాతీయ రహదారి పండ్ల మార్కెట్ సమీపానికి చేరుకునే సరికి రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపుకు వెళ్తున్న లారీ వీరిబైకును ఢీకింది. ఈ ప్రమాదంలో రివచ్చా, చంద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. నాగేశ్వరావుకు తల, కాలికి గాయం తగలడంతో 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

### బాలిక కిడ్నాప్, అత్యాచారంపై దర్యాప్తు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఒక బాలికను వివాహితుడు కిడ్నప్ చేసి, అత్యాచారం చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అనాతవరం పంచాయతీ పరిధికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ సోమవారం కిడ్నాప్ చేసి, అమలాపురం ఎర్రవంతెన సమీపంలోని ఒక ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పండ్లు నిల్వ చేసే గది దగ్ధం

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో దివాన్ చెరువు జాతీయ రహదారి పక్కన పండ్ల మార్కెట్లో పండ్ల నిల్వ చేసే గది సోమవారం దగ్ధం జరిగింది. దీనిపై జిల్లా అగ్ని మాపకదళాధికారి సిహెచ్ మార్టిన్ లూథర్‌కింగ్ తెలిపిన వివరాల మేరకు ఒక రేకుల షెడ్‌లో చుట్టూ గడ్డి వేసి పైన తాళ్లు, హ్యాగిలర్లతో ఇతర రాష్ట్రాల్లో పండుతున్న యాపిల్, ఆరెంజ్, డ్రాకాన్ తదితర పండ్లను నిల్వ ఉంచు గదిలో ప్రమాద వశాత్తూ అగ్ని ప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ ట్రేలు, గది చుట్టూ గడ్డి ఉండడంతో మంటల చెలరేగాయి. ఇవి మైత్రం కాలి బూడిదైపోయాయి. భారీగా మంటలు, పొగ రావడంతో చుట్టు పక్కల ప్రజలు భయంతో పరుగులు తీశారు. ప్రతి రోజూ పండ్లు అమ్మకుని సాయంత్రం వీటిని గదిలో నిల్వ ఉంచుతామనిబాధితులు ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదం వలన సుమారు రూ.50 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. అగ్ని ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని పూర్తి నివేదికలు జరిగిన వచ్చిన తర్వాత నష్టం, ప్రమాదం కారణాలు తెలుస్తాయని అగ్ని మాపకాధికారి తెలిపారు.

### దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురంలో సోమవారం ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూతరేకుల తయారీ షాపులు, డ్రై ఫ్రూట్స్ షాపులు, హోటల్స్, స్వీట్ షాప్‌లపై దాడులు నిర్వహించారు. షణ్ముఖ డ్రైఫ్రూట్స్ షాపులో కంపెనీ బ్రాండ్స్ లేకుండా ప్లాస్టిక్ కవర్లో ఉన్న 160 కేజీల కల్తీ నెయ్యిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పూతరేకులు షాపులో పూత చుట్టాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఫీల్డ్ కవర్‌లో భద్రపరిచి హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీకాంత్ చౌదరి, ప్రసాద్, సుబ్బారావు, రొక్కయ్య పాల్గొన్నారు.


సీజ్ చేసిన కల్తీ నెయ్యిని చూపిస్తున్న అధికారులు

# భూములకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రైతుల ఆధార్‌ను భూమి రికార్డులతో అనుసంధానం చేయడం ద్వారా, భూమి యాజమాన్యం, పంట వివరాలు, ఆర్థిక ప్రయోజనాలను ఏకీకృతం చేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లాలో చేపట్టి ఆమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జాయింట్. కలెక్టరు చిన్న రాముడు, డిఆర్ఓ సీతారామ మూర్తితో కలసి డివిజన్, మండలం స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్, జిఎస్‌డబ్ల్యూఎస్, రైతుల నమోదు, ఎశ్రామ్ నమోదు, హౌసింగ్, డ్వామా అంశాలపై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రీ సర్వేలో రైతులకు సంబందించిన భూములను సకాలంలో ఆధార్ అనుసంధానం చేస్తూ రిజిస్ట్రేషన్ పక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఏమైనా సాకేంతిక లోపాలుంటే వాటిని పరిష్కరించాలన్నారు. ల్యాండ్ రికార్డ్‌లో రైతు యొక్క ఖచ్చితమైన సమాచారన్ని అప్ లోడ్ చేయాలన్నారు. అసంఘటిత కార్మికుల డేటా, నమోదు, సేకరణ, అవసరమైన డేటాను గుర్తించడం కోసం ఈశ్రమ్ పోర్టల్ ఉపయోగిస్తామన్నారు. కార్మికుల సౌలభ్యం ప్రకారం స్వీయ నమోదు ద్వారా వారిని నమోదు చేసుకునే సౌకర్యాన్ని పోర్టల్ అందిస్తుందనన్నారు. ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ జిల్లాలో పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. చిన్న సన్నకార రైతులను, పంచాయతీ శానిటేషన్ సిబ్బందిని, హౌసింగ్ నిర్మాణం చేసే గృహ లబ్ధిదారుల వివరాలను ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఆయా శాఖల సచివాలయ, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారం తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణంపై సమీక్షిస్తూ స్టేజి కన్వర్షన్‌ను వేగవంతం చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పిజిఆర్ఎస్ కింద జిల్లాలో ఇప్పటి వరకు 21,424 దరఖాస్తులు రాగా వాటిలో 18,754 పరిష్కరించామన్నారు. రీ ఓపెన్ కేసుల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వస్తున్నాయన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఆర్ఓఆర్ రికార్డులను జాయింట్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించనున్నట్లు తెలిపారు. ఏదైనా అర్జీ తిరస్కరిస్తే సరైన ఆధారాలు ఉండాలనారు. కోరుకొండ, గోపాలపురం మండలాల్లో రిఓపెన్ కేసులను వ్యక్తిగతంగా తనిఖీ చేస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్‌కు సంబంధించి వాటిని జిల్లా రెవిన్యూ అధికారి నిర్వహించాలన్నారు. గోకులం షెడ్లకు సంబంధించి మంజూరు చేసిన యూనిట్స్‌ను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రెవిన్యూ సంబంధ సేవా లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వర రావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బిఎస్ఎం.వలీ, డిఎల్‌డిఒ వీణా దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ బివి.గిరి, కలెక్టరేట్ ఎఒ ఎమ్‌డి.అలీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌కు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి - పెరవలి

పోలీస్ స్టేషన్‌కు కానూరు గ్రామానికి చెందిన రామా గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రెటరీ, కరెస్పాండంట్ పుల్లూరి అశోక్ కుమార్ ప్రింటర్‌ను బహూకరించారు. దీన్ని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌కు ఎస్ఐ ధన్యవాదాలు తెలిపారు.


ప్రింటర్‌ను అందిస్తున్న దాత అశోక్‌కుమార్

### మండలంలో 2,651 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో 2,651 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, వీరినిలో 1,575 మంది పురుషులు, 1076 మంది మహిళలు ఉన్నారని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ సోమవారం తెలిపారు. బూత్ నెంబర్లు 369, 370లకు ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 371, 372 బూత్‌లకు ఉండ్రాజవరం ఎంపిపి పాఠశాల నెంబర్ 2లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 27వ తేదీ, గురువారం ఉదయం ఎనిమిది గంటల నుండి, సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే ఈ ఎన్నికకు ఓటర్లు తమ ఓటర్ గుర్తింపు కార్డు, లేదా ఆధార్ కార్డు ను ఓటు హక్కు వినియోగించుకునేందుకు తీసుకురావాలన్నారు.

# అరాచకాన్ని అడ్డుకునేందుకు తరలిరావాలి

**-కౌన్సిలర్లకు భద్రత కల్పించాలి**
**-వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా**

ప్రజాశక్తి - తుని

కూటమి ప్రభుత్వ అరాచకాన్ని అడ్డుకునేందుకు మంగళవారం వైసిపి శ్రేణులంతా తుని పట్టణానికి పెద్దఎత్తున తరలిరావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తుని మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డుల్లోనూ వైసిపికి చెందిన వారే కౌన్సిలర్లుగా ఉన్నారని అన్నారు. ఈనెల 3వ తేదీన మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించే సమయానికి 29 మంది కౌన్సిలర్లు ఉన్నారని, వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కౌన్సిల్‌కు వెళ్లగా టిడిపి కార్యకర్తలు, రౌడీలు ఛైర్మన్‌తోపాటు, కౌన్సిలర్లపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. దీంతో అధికారులు 4వ తేదీకి ఎన్నికను వాయిదా వేశారని తెలిపారు. ఆ రోజు అదేరీతిలో టిడిపి నాయకులు వ్యవహరించారని, దీంతో తమకు రక్షణ కల్పించాలని ఛైర్మన్ ఏలూరు సుధారాణి, కౌన్సిలర్లు కోర్టును ఆశ్రయించారని, దీంతో కోర్టు ఉత్తర్వులు మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో ఎన్నికకు ఏర్పాట్లు చేశారని అన్నారు. ఆదివారం రాత్రి నుంచి టిడిపి గూండాలు కౌన్సిలర్లు ఇళ్లపై దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. సోమవారం జరిగే వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం వస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు టిడిపి నాయకులు, కార్యకర్తలను ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. మున్సిపల్ ఛైర్మన్ సుధారాణి ఇంటిపై దాడి చేసి, సిసి కెమెరాలను ధ్వంసం చేశారని అన్నారు. ఇంటిలో ఉన్న ఛైర్మన్ భర్త, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఏలూరు సుధాబాలును తుని రూరల్ సిఐ జి.చెన్నకేశవరావు బలవంతంగా లాక్కొచ్చి అరెస్టు చేశారని అన్నారు. వైసిపి కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించగా వారితో పెనుగులాడి ఇంటికి తాళం వేయడం జరిగిందని అన్నారు. 17 మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారని సంతకాలు చేసిన విప్‌ను ఎన్నికల అధికారులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి కలెక్టర్, ఎస్పి ప్రత్యక్ష రక్షణ కల్పించాలని ఆయన కోరారు. యనమల కృష్ణుడు మాట్లాడుతూ తునిలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గతంలో ఎన్నడూ లేనంత విధంగా కూటమి ప్రభుత్వం రాక్షస పాలన చేస్తుందని అన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

# ఓటమి భయంతోనే రావడం లేదు

ప్రజాశక్తి - తుని

ఓటమి భయంతోనే మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా వైసిసి కౌన్సిలర్లను ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారని టిడిపి సీనియర్ నాయకులు చింతమనేడు అబ్బాయి ఆరోపించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైస్ ఛైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు పాల్గొనకుండా మున్సిపల్ ఛైర్మన్ ఏలూరి సుధారాణి ఇంటిలో దాచిపెట్టి తిరిగి కూటమి ప్రభుత్వంపైనా, పోలీసులపైనా బురదజల్లుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి దాచిపెట్టిన కౌన్సలర్ల కోసం వారి బంధువులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మా వాళ్లకు రక్షణ కల్పించాలని కోరుతున్నారని, 200 మంది పోలీసుల బందోబస్తు మధ్య స్వేచ్ఛ వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తుంటే కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. జగన్ పాలనలో మంత్రిగా ఉండి మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి వారిని నామినేషన్ కూడా వేయకుండా అడ్డుకుని, అక్రమ కేసులు పెట్టించిన సంగతిని మాజీ మంత్రి మరిచిపోయినా తుని పట్టణ ప్రజలు మరచిపోలేదని అన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇనిగంటి సత్యనారాయణ గుండెల మీద చెయ్యేసి కాలర్ పట్టుకుని పక్కకు నెట్టేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తునిలో అల్లర్లు సృష్టించేందుకే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా చలో తుని పిలుపునిచ్చారని, అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో యనమల రాజేష్, సొర్ల లోవరాజు, మోతుకూరు వెంకటేష్, అంకమ్మరెడ్డి రమేష్, ఇనుగంటి సత్యనారాయణ, చిట్టుమూరి శివ,అంకమ్మ రెడ్డి బుల్లిబాబు, వెలగా వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని అబ్బాయి

### ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆదిత్య ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్ఐ వి.మౌనిక ప్రారంభించి మాట్లాడారు. హెల్మెట్ లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంఇ మృతి చెందుతున్నారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వాహన చట్టాలు, వాహన ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

### ఆదిత్య ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మసీ కాలేజీలో 'క్లినికల్ రీసెర్చ్, ఫార్మాకోవిజిలెన్స్- మ్యాటీరియో విజిలెన్స్' అనే అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో క్లినెట్రా సొల్యూషన్స్(ఎల్ఎల్‌పి) సిఇఒ డాక్టర్ రాజశేఖర్ దంతా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ, రోగుల భద్రతపై వివరించారు. క్లినెట్రా సొల్యూషన్స్ బ్రాంచ్ మేనేజర్ రవి తేజ ఫార్మాకోవిజిలెన్స్ డేటాబేస్ సాఫ్ట్‌వేర్ టూల్‌ను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. సదస్సులో ఆదిత్య ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసం, విజ్ఞాన వృద్ధికి విలువైన సమాచారం అందించిన క్లినెట్రా సొల్యూషన్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

### చోరీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాజులూరు

చోరీలపై యువత అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని కోలంకలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో చోరీలు అధికం అయ్యాయని అన్నారు. వీటిని నివారించడానికి పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నప్పటికీ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయని అన్నారు. వీటిని నివారించడానికి యువత అప్రమత్తంగా ఉండి రాత్రిపూట బృందంగా ఏర్పడి గస్తీ తిరిగితే ఫలితం ఉంటుందన్నారు. ముఖ్యమైన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటుకు స్థానికుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించాఉరు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది నాగేశ్వరరావు, శేఖర్‌మూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

### గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గడ్డి మందు తాగిన వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల సామేలు(30) మద్యానికి బానిసయ్యాడు. పని ఏమీ చేయకుండా తిరుగుతుండేవాడు. ఈ నెల 16వ తేదీన సెల్‌ఫోన్ కొనడానికి తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో అతడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతనిని రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు తెలిపారు మృతిని తమ్ముడు సోమరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### 'చలో తుని'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

మంగళవారం నిర్వహించే చలో తుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బూత్ కమిటీల అధ్యక్షులు ఒమ్మి రఘురాం పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా కూటమి పార్టీల నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. బలం లేకపోయినా వైస్ ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులను సైతం పోలీసులు అమలు చేయడం లేదన్నారు. జిల్లాలలో 7 నియోజకవర్గాల నుంచి నాయకులు పెద్ద ఎత్తున చలో తుని కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# కాకినాడ పోర్టును సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల రాజమహేంద్రవరం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన బిబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కాకినాడ పోర్టును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు అధికారులు, విద్యార్థులకు సరుకు లోడ్ చేయడం, ఆన్‌లోడ్ చేయడం, పోర్టు భద్రత చర్యలు, లాజిస్టిక్స్ పాత్ర వంటి వాటిపై వివరించారు. విద్యార్థులకు లాజిస్టిక్స్ పరిశ్రమలో అనుభవత్మక అవగాహనను అందించేందుకు, ప్రోత్సహించేందుకు భాగంగా ఈ క్షేత్ర పర్యటనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రకు, కామర్స్ విభాగాధిపతి పిపివి.సత్యనారాయణ, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎఎ.అన్నపూర్ణకు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ పర్యటనలో బిబిఎ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ కో- ఆర్డినేటర్ బి.సుజాత, ఆర్.యునైసి, కెడిఎస్ లక్ష్మి, పి.ధనుష్ పాల్గొన్నారు.


సీ పోర్టులో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

### గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని వేలివెన్ను సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్ సూచించారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి టి.శేషుబాబు అధ్యక్షతన పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించే విధానం, పారిశుధ్య సిబ్బందికి గ్రామ ప్రజలు అందజేసే విధానం, సంపద తయారీ కేంద్రాల నిర్వహణ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సేకరించిన చెత్త నుండి ప్లాస్టిక్, అట్టలను వేరువేరుగా ఏ విధంగా చేయాలో తెలియజేశారు.


అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ



### విజయ్ కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇటీవల గోరక్షణపేటవద్ద ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో మృతి చెందిన కాకర్లపూడి విజయ్ రుపాస్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. తుమ్మలోవ వివి.గార్డెన్స్ ఎదురు వీధిలోని విజయ్ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.లక్ష ఆర్థిక సాయం అదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయ్ చెల్లి చదువు బాధ్యతలను తాను తీసుకుంటామని చెప్పారు. అతడి సోదరుడికి మంచి ఉద్యోగం వేయిస్తామని తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రతిపక్షాలు రాజకీయాలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. విజయ్ కుటుంబానికి కాంట్రాక్టర్ నుంచి రూ.7 లక్షలు, తమ భవానీ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.లక్ష అందించామని వివరించారు. ప్రాణాలను డబ్బుతో కొలవలేమని, పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకు రాలేమని, అయితే ఎదిగిన కొడుకు ఇలా అయితే ఆ కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసని, అందుకే ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నామని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యాళ్ల ప్రదీప్, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, మొకమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.